కథ

# మౌనంగానే....

ఎం.వెంకటేశ్వరరావు

**"ఏవండీ! ఇవ్వాళ పేపర్ చూశారా! ఈ సంవత్సరం ఇంటర్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు, ఎంసెట్ మెడిసిన్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు ఒకే అమ్మాయికి వచ్చాయి" ఆశ్చర్యంగా చెప్పింది సౌజన్య.**

''సూపర్ ఇంటిలిజెంట్ అయుంటుంది''

''అంతే కాదు ఎక్కడా కోచింగ్ తీసుకోకుండా, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదివిందట.''

''అలాగా?!..ఏ ఊళ్ళో..''

''మీరు ఇంటర్ చదివిన రుద్రవరం కాలేజీలో''

''అవునా?!?!'' రెట్టింపు ఆశ్చర్యం ప్రకటించటం నా వంతైంది.

''సందుకో కార్పొరేట్ కాలేజీలున్న సిటీల్లో, చదువులకి వేలల్లో వెలకట్టి రేయింబవళ్ళూ ర్యాంకులకోసం, పిల్లల ప్రాణాలు తోడేస్తుంటే...ఈ అమ్మాయి ఎచ్చీవ్‌మెంట్ గ్రేట్ కదా!'' సౌజన్య ఫుల్‌స్టాప్ లేకుండా చెప్పుకుపోయింది.

ల్యాప్ టాప్ ముందెట్టుకుని, ఇంటర్నెట్ చూస్తున్న నేను, దాన్ని పక్కన పెట్టి..కిటికీ నుండి బయటికి చూశాను. చల్లని గాలి వింజామరలా మొహాన్ని తాకుతుంటే..మనసు నేను చదివిన రుద్రవరం ఎస్.ఎన్.కె. జూనియర్ కాలేజీలో, నేను కూచున్న క్లాస్‌రూంకి గాల్లో ఎగిరే హ్యారీ పాటర్‌లా వెళ్ళిపోయింది. నేనెప్పుడూ కూచునే నాల్గో బెంచీ వైపు ఆప్యాయంగా చూసిన కళ్ళు, కాళ్ళని వేగంగా అక్కడికి లాక్కెళ్ళి కూచోబెట్టాయి. అంతే! అంతరంగంలో నిద్రిస్తున్న అలనాటి జ్ఞాపకాలు, ఒళ్ళు విరుచుకుని, ఎగిరి గంతేసి బయటపడేసరికి, నా చుట్టూ అప్పటి వాతావరణం ప్రత్యక్షమైంది.

★ ★ ★

1987వ సంవత్సరం...

''రవీ! నిన్న కాలేజీ ప్రిన్సిపాల్‌తో మాట్లాడొచ్చాను. ఈ రోజెళ్ళి ఫీజుకట్టి, క్లాసుకెళ్ళు, క్లాసులు మొదలయ్యాయి.''

''పోన్లెండి వాడు టౌను కెళ్ళి చదువుకుంటానంటున్నాడు. వాడిష్టప్రకారమే చదువుకోనిద్దురు''

''చదువుమీద శ్రద్ధుంటే..ఎక్కడ చదివినా వస్తుంది. వాణ్ణి వెనకేసుకు రాకుండా..నీ పని చూసుకో'' అమ్మని మాట్లాడనివ్వలేదు నాన్న.

నాన్న బ్యాంకులో పన్జేస్తాడు. హైదరాబాదులో పదేళ్ళు చేశాక, రూరల్ బ్రాంచికి ట్రాన్స్ఫర్ చేశారు. నేను ఇంటర్ ఫస్టియర్ సగంలో ఉన్న కారణంగా, ఆర్నెల్లు నాన్నే వెళ్ళొచ్చేవారు. నాకు పరీక్షలయిపోయాక అందరం ఊరు మారిపోయాం.

★ ★ ★

మొదటిరోజే...అయిష్టతతో క్లాసుకి లేటుగా వెళ్ళాను. అప్పటికే క్లాసు మొదలయింది. నన్ను పైనుండి కిందికి చూసిన లెక్చరర్-

''న్యూ అడ్మిషనా?'' అన్నారు.

ఔనన్నట్టు తలూపాను. క్లాస్ రూముని, అక్కడ స్టూడెంట్స్‌నీ చూస్తుంటే స్వర్గం నుండి నరకానికి వచ్చినట్టనిపించింది. స్టూడెంట్సంతా నా వైపే చూస్తుంటే..తలొంచుకుని వెళ్ళి ఖాళీగా ఉన్న నాలుగో బెంచీలో కూచున్నాను.

లెక్చరర్ నా పుట్టుపూర్వోత్తరాలడిగి, నన్ను క్లాసుకి పరిచయం చేశాడు. క్లాసంతా మరోసారి చూశాను. ముందు బెంచీల్లో అమ్మాయిలు లంగా ఓణీల్లో, ఒకళ్ళిద్దరు చుడీదార్లలో ఉన్నారు. ఒకే ఒక అమ్మాయి మాత్రం బాబ్డ్‌కట్‌లో, ప్యాంటు, షర్టుతో వాళ్ళందరి మధ్యా ప్రత్యేకంగా కన్పించింది.

ఆఫ్రికన్ అడవిలో దిగిన అమెరికన్ అమ్మాయిలా ఉంది, ఎవరీమె...అనుకుంటూ సాయంత్రం ఇంటికెళ్ళేసరికి..

''గాయత్రీ! మా బ్రాంచి మేనేజరు రొజారియో..పోయిన్నెలే వైజాగ్ నుండి ప్రమోషన్ మీదొచ్చాడు. ఆయన కూతుర్ని వీడి కాలేజీలోనే చేర్చారట'' అని నాన్న అమ్మతో చెబుతుంటే...

''ఆ అమ్మాయే అయుంటుంది'' అని మనసులో అనుకుంటూ లోపలికెళ్ళాను.

★ ★ ★

వారం రోజుల్లో క్లాసంతా పరిచయమయ్యారు. ఆ బాబ్డ్‌కట్ అమ్మాయే మార్గరెట్..బ్యాంకు మేనేజరు కూతురు.

కెమిస్ట్రీ నాకు ఇష్టమైన సబ్జెక్టు. లెక్చరర్ అడిగే ప్రశ్నలన్నిటికీ ఎక్కువగా నేనే బదులిచ్చేవాడిని.

''రవీ! నీ కెమిస్ట్రీ నోట్ బుక్కోసారి ఇస్తావా?'' అడిగింది గిరిజ.

''నా రైటింగ్ అంత బావుండదు''

''ఫరవాలేదు'' అని తీసుకుంది.

తర్వాత నా నోట్‌బుక్ లావణ్య దగ్గర, మరుసటి రోజు మార్గరెట్ చేతుల్లో చూశాను. ఎందుకో..నేనే ఆమె చేతుల్లో ఉన్నట్టు ఫీలయ్యాను. వయసు ప్రభావం గాబోలు.

రెండ్రోజుల తర్వాత గోపాల్ ద్వారా నా నోట్‌బుక్ తిరిగి పంపిందామె.

''ఇది నాది కాదు'' అన్నాను.

''నీదే..మార్గరెట్ కవరేసింది'' అన్నాడు.

అప్పుడు నా కళ్ళు..మార్గరెట్ వైపు తిరిగాయి. ఆమె నా వైపు చూసి నవ్వింది. కాదు మనసుకి దగ్గరైంది.

★ ★ ★

''హార్ట్ ఇది?..సైన్సంటే ఇంట్రస్ట్ లేని వాడికి బొమ్మలు గీయటం ఎలా వస్తుంది. సాలెగూడులా నాలుగ్గీతలు గీస్తే, రికార్డుకి మార్కులు రావు. ఇష్టం లేకపోతే ఆర్ట్సులో చేరాల్సింది'' అని అందరిముందు జువాలజీ లెక్చరర్ రికార్డు నా మొహాన విసిరేశాడు.

అవమానంతో అక్కడ నిలబడలేక క్లాసు నుండి వెళ్ళిపోయాను.

మధ్యాహ్నం క్లాసుకొచ్చేసరికి..నా ప్లేసులో ఉన్న నా జువాలజీ రికార్డు చూశాక గుర్తొచ్చింది. ఉదయం క్లాసు నుండి నేనది తీసుకెళ్ళ లేదని.

నేను డ్రా చేసిన సాలెగూడు హార్ట్‌ని చూద్దామని తెరిచాను. ఆశ్చర్యం. అందులో హార్ట్ బొమ్మ అందంగా గీయబడుంది.

దానివైపే ఆశ్చర్యంగా చూస్తుంటే..గోపాల్ వచ్చి..

''దీన్ని మార్గరెట్ గీసింది'' అన్జెప్పాడు.

నా కళ్ళు ఆమె వైపు చూశాయి. ఎవర్తోనో మాట్లాడుతున్న మార్గరెట్ నా వైపు చూసి అందంగా నవ్వింది.

''థ్యాంక్స్'' అన్నాను.

''ఇట్సాల్‌రైట్'' అంది నవ్వుతూ.

అంతే! నాలో ఏవో ప్రకంపనాలు మొదలై ఆ రాత్రంతా నిద్రలేదు. కళ్ళు తెరిచినా, మూసినా మార్గరెట్ కళ్ళ ముందు కన్పిస్తోంది.

అర్ధరాత్రి లేచి కూచుని, ఆమె గురించి నేనను కునే భావాల్ని కవితగా కాగితం మీది కెక్కిం చాను.


మరసటిరోజు ''కవితని ఆమెకెలా ఇవ్వా లన్న ఆలోచనతోనే'' కాలేజీ కెళ్ళాను.

ఆపద్బాంధవుడిలా గోపాల్ కన్పించాడు. గోపాల్‌ని అందరూ 'తపాలా గోపాల్' అని పిల్చేవాళ్ళు. క్లాసులో అమ్మాయిలకి, అబ్బాయిలకీ పుస్తకాలే కాక ప్రేమ లేఖలూ అందిస్తాడని విన్నాను.

విషయం విని, ''ఇంతేనా!'' అన్నాడు సింపుల్‌గా.

ఇచ్చాక మొదలైంది టెన్షన్. ఆమె ఏమంటుందో, కంప్లయింటి స్తుందో, అల్లరి పెడ్తుందో... అనే భయం.

ఆ రాత్రంతా టెన్షన్‌తో నిద్ర పట్ట



లేదు.

మర్నాడు- ఉదయమే..గోపాల్ ఇంటికెళ్ళాను.

''ఇచ్చావా?'' అన్నాను కంగారుగా.

''నిన్న సాయంత్రం ఇచ్చాను'' అన్నాడు కూల్‌గా.

''ఏమంది?''

''చదివి, నవ్వి, బుక్‌లో దాచుకుంది''

''హమ్మయ్య'' అనుకున్నాను తేలిగ్గా.

★

★ ★

రెండ్రోజుల తర్వాత బోటనీ ప్రాక్టికల్స్‌లో మార్గరెట్ చేతి వేలు తెగి రక్తం కార సాగింది. గిరిజ, లావణ్య, గోపాల్‌లతో బాటు, లెక్చరర్ కూడా కంగారుపడి ఫస్టెయిడ్ చేశారు.

చూస్తూ కూచున్న నేను ధైర్యం చేసి మార్గరెట్ దగ్గరకెళ్ళలేకపోయాను. ఎలా ఉందని అడగలేకపోయాను.

క్లాసు పూర్తవకుండానే మార్గరెట్ వెళ్ళిపో యింది.

ఆరోజు సాయంత్రం కాలేజీ నుండి ఇంటికెళ్తూ, మార్గరెట్ వాళ్ళింటి ముందు రెండు రౌండ్లు కొట్టాను. ఆమె కన్పిస్తే పలకరించాలని. ఆమె కన్పించక నిరాశగా ఇల్లు చేరాను.

ఆ తర్వాత నా కవితా పైత్యాన్ని పేపర్లమీది కెక్కించి గోపాల్ ద్వారా మార్గరెట్‌కి పంపుతూనే ఉన్నాను.

తీసుకుంటోంది గానీ ఏ విధమైన రెస్పాన్సూ లేదు.

ఆమె అభిప్రాయం కోసం ఎదురుచూపు ల్లోనే..కాలం గిర్రున ఆర్నెల్లు గడిచింది. హాఫ్ ఇయర్లీ పరీక్షలయి, వారం రోజులు హాలిడేసి చ్చారు. క్షణమొక యుగంలా గడిచేది. అనుక్షణం ఆమె రూపమే కన్పించేది. నాది ప్రేమో, అభిమా నమో నాకే తెల్సేది కాదు. ఆమెని చూడాలి, ఆమెతో మాట్లాడాలి. ఈ ధ్యాస ఎక్కువై, పుస్త కాలు చూడగానే పురుగుల్లా కన్పించేవి.

★ ★ ★

కాలేజీ రీ ఓపెనింగ్ రోజున క్లాసుకి అందరికంటే ముందే వెళ్ళి మార్గరెట్ ప్లేసులో కూచున్నాను. అప్పటికి ఎవరూ రాలేదు. తలొంచుకుని ఆలోచి స్తుంటే...

''హలో'' మార్గరెట్ గొంతు విని తలెత్తాను.

''వై డిడ్ యూ సిట్ హియర్?'' అంది అందంగా ఆంగ్లో ఇండియన్ యాసలో.

''నథింగ్'' అని లేచి ఇవతలి కొస్తుంటే...

''హాలిడేస్ బాగా ఎంజాయ్ చేశావా?''

''లేదు'' అని నా ప్లేసుకి వెళ్ళి కూచున్నాను. అంతలో లావణ్య, గిరిజ రావటంతో మార్గరెట్

వాళ్ళతో ముచ్చట్లు మొదలెట్టింది.

ఫిజిక్సు ప్రాక్టికల్స్‌లో మార్గరెట్, నేనూ పక్క పక్కనే నుంచుని చేస్తున్నాం. మధ్యలో కాలిక్యులేషన్స్ చేసిపెట్టమని బుక్ ఇచ్చింది. చేసి తిరిగిస్తూ, నా జేబులో ఉన్న లెటర్ తీసి ఆమె బుక్‌లో పెట్టటం చూసింది.

ఏమైనా అంటుందేమోనని భయపడ్డాను. ఆమె మౌనంగా తీసుకునేసరికి ధైర్యం వచ్చింది.

ఆరోజు సాయంత్రం కెమిస్ట్రీ థియరీ క్లాసులో హాఫియర్లీ ఎగ్జామ్ పేపర్లిచ్చాడు లెక్చరర్. నాదే లాస్ట్ మార్క్.

''ఎప్పుడూ ఫస్టొచ్చేవాడివి. ఈసారి ఏమైంది నీకు? బాగా చదువు. ఇంటర్‌మీడియట్ లైఫ్‌కి టర్నింగ్ పాయింట్ అని గుర్తుంచుకో'' అని నాకో వార్నింగిచ్చాడు కెమిస్ట్రీ లెక్చరర్.

అందరి ముందూ మరోసారి అవమానం. నావైపే చూస్తున్న మార్గరెట్‌ని చూసే ధైర్యం చాలక బయటికెళ్ళిపోయాను.

ఆరోజు రాత్రి బుద్ధిగా చదువుకోవాలని బుక్సు ముందేసుక్కూచున్నాను. పది నిముషాలు చదివేసరికి..మార్గరెట్ రూపం కళ్ళముందు కన్పించసాగింది.

''ఇవ్వాళ నోట్ బుక్‌లో ఉంచిన లెటర్..చూసే ఉంటుంది. ఈ లెటర్‌కి తప్పకుండా రిప్లై ఇస్తుంది. ఇవ్వాలి, ఇచ్చి తీరుతుంది'' అని అనుకుంటూ..పుస్తకాలు మొహం మీదేసుకుని, ఊహల్లోకెళ్ళి, అట్నుంచటే నిద్రలోకి జారిపోయాను.

మరుసటి రోజు ఉదయం...నాన్న అమ్మతో చెబుతుంటే విన్నాను.

''గాయత్రీ! నిన్న మా మేనేజరు నన్ను ఛాంబర్లోకి పిలిచి, ''రావుగారూ! ఈ లెటర్సన్నీ మీ అబ్బాయి రవి, మా అమ్మాయికి రాసిన ప్రేమలేఖలు..లెటరిచ్చినప్పుడల్లా తెచ్చి నాకిచ్చేది. చదివి 'ఇన్‌ఫాక్చుయేషన్' అని నవ్వుకునే వాళ్ళం. కానీ ఇవ్వాళ ఉదయం ఇచ్చిన లెటరిది. చాలా ఘాటుగా ఉంది. మీరూ చదవండి'' అనిచ్చాడు.

మనవాడు ఏం రాశాడో విను.

'మార్గరెట్!

ఇది నాకు నువ్వు గీసిచ్చిన 'హృదయం'. ప్రాక్టికల్స్‌లో నీ చెయ్యి తెగి, రక్తం కారటం చూసి తట్టుకోలేకపోయాను. ఆ బాధ..నాకూ తెలియాలని, నా వేలూ..కట్ చేసుకుని రక్తంతో రాసినవి ఈ ప్రేమాక్షరాలు. ఎన్ని లెటర్సిచ్చినా నవ్వుతూ తీసుకుంటున్నావుగానీ 'నిర్ణయం' మాత్రం చెప్పవు. నన్ను ప్రేమిస్తున్నావో, ద్వేషిస్తున్నావో అర్థంగాకుండా ఉంది. నీ కళ్ళలో ఉన్న పవరు నన్ను పిచ్చివాణ్ణి చేస్తోంది. చదువు ఎక్కటం లేదు. మనసంతా నువ్వే. ఇహ నీ నిర్ణయం మీదే..నా భవిష్యత్తు. అందుకే నీ హృదయానికి రక్తాభిషేకం చేసి, రక్తాక్షరాలతో రాస్తున్నాను. నువ్వు నా ప్రేమనంగీకరిస్తే, ప్రపంచం నా చేతిలో ఉంటుంది. కాదంటే..మరణం చేతిలో నేనుంటాను. నిర్ణయం నీదే''

చదివి ఏం మాట్లాడాలో తెలీక నిలబడ్డిన్నేను. ఈ లెటర్ కొంచెం తీవ్రంగా ఉండటంతో మీకు చెప్పాను. మీ అబ్బాయిని కొట్టి, తిట్టమని కాదు నా ఉద్దేశం. అతనికి అర్థం అయ్యేలా వివరించండి. ఈ వయస్సు పిల్లలకిది సహజం. అఫ్‌కోర్సు మనం ఇవన్నీ దాటొచ్చాం. మనం హార్ష్‌గా ప్రవర్తిస్తే తల్లిదండ్రుల్నే బద్ధశత్రువుల్లా చూస్తారు.

లాస్టియర్ మా మార్గరెట్‌కి వైజాగ్‌లో ఓ అబ్బాయి ఇలానే లెటర్సిచ్చేవాడు. ఏడుస్తూ వచ్చి నాతో చెప్పింది. నేనూ మొదట ఆవేశపడ్డాను. కాస్సేపాలోచించి, మార్గరెట్‌తో 'అతనిచ్చే లెటర్సన్నీ నాకు తెచ్చివ్వు. నువ్వేటువంటి రిప్లైగానీ, రియాక్షన్‌గానీ ఇవ్వకు. అలా చేస్తే రెచ్చిపోతాడు. ప్రతిచర్య లేని చర్య నిరుపయోగం అని తెల్సుకుని అతనే మానేస్తాడు' అన్చెప్పాను. అలాగే మీ రవి ఇచ్చిన లెటర్సే ఇవన్నీ అని ఇచ్చాడు. అవే...ఇవి..'' అని అమ్మకిస్తూ..

''గాయత్రీ! నేను వీణ్ణెప్పుడు కొట్టను, తిట్టను. కానీ వీడితో మాట్లాడను. చదువుకుని, మంచి ఉద్యోగం సంపాదించి వచ్చిన్నాడే మాట్లాడతాను. ఎట్టి పరిస్థితుల్లోనూ నా నిర్ణయం మారదు. వెళ్ళి నీ కొడుక్కి చెప్పు'' అని నాన్న బయటికెళ్ళాడు.

అంతా విన్న నాకు వళ్ళంతా చెమటలు పట్టాయి.

నన్నో ఫ్రెండ్‌లా చూస్తూ, చిన్న షాపింగ్ కెళ్ళినా వెంట తీసుకుని వెళ్ళి ఎన్నో విషయాలు నాతో చర్చించే నాన్న..ఇహ నాతో మాట్లాడననటం జీర్ణించుకోలేకపోయాను.

నాన్న నాపై చూపే ప్రేమ ముందు..మార్గరెట్ కోసం..నా వన్‌సైడ్ లవ్ అర్థరహితంగా అన్పించింది. అంతే! ఆ క్షణంలో నేను తీసుకున్న నిర్ణయం నా జీవిత లక్ష్యాన్ని నిర్దేశించింది.

★ ★ ★

1996వ సంవత్సరం.

ఆంధ్రా యూనివర్శిటీలో ఎంఎస్సీలో గోల్డ్‌మెడల్ సాధించి, క్యాంపస్ ఇంటర్వ్యూలో మంచి ఉద్యోగం తెచ్చుకుని, అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో ఇంటి కెళ్ళాను. నాన్న కాళ్ళకి నమస్కరించి, లెటర్ చేతికిచ్చాను. నన్ను లేవనెత్తిన నాన్న గుండెలకి హత్తుకున్నాడు. ఏడేళ్ళ నాన్న మౌనం అశ్రువులుగా మారి నా భుజాన్ని తడిపేసింది. నాదీ అదే పరిస్థితి.

నాన్న స్నేహితుడి కూతురు సౌజన్య నా భార్య అయింది. ఆమె ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేస్తోంది.

★ ★ ★

2006వ సంవత్సరం.

నేను గతం నించి బయటకొచ్చేసరికి సౌజన్య ఆఫీసుకెళ్ళిపోయింది. ఎయిత్‌క్లాస్ చదువుతున్న నా కూతురు భావన నా దగ్గరకొచ్చి ''డాడీ'' అనేసరికి

''ఏమిటి భావనా? స్కూలు కెళ్ళలేదా?'' అన్నాను.

''వెళ్ళలేదు. నా సెల్‌కి మా క్లాసబ్బాయి అనీష్ పిచ్చి పిచ్చి మెసేజ్‌లు పంపుతున్నాడు. హి యీజ్ డిస్టర్బింగ్ మి ఎలాట్'' అని సెల్ నా చేతికిస్తూ చెప్పింది.

సెల్‌లో చూశాను. పది మెసేజ్‌లు పైనే ఉన్నాయి. అన్నిటి సారాంశం ఒక్కటే. ఐ.ఎల్.యు, 143, ఎల్ యు వి..మి..పిక్చర్ మెసేజ్‌లు..ఇలా.

భావన ఎత్తుగా, తెల్లగా, బొద్దుగా వయసుకి మించిన పర్సనాలిటీతో అందంగా ఉంటుంది. నేనూ, సౌజన్య ఉద్యోగాల కెళ్తుండటంతో, 'కమ్యూనికేషన్' కోసం భావనకి ఓ సెల్‌ఫోన్ కొనిచ్చాం.

''ఆ అనీష్‌కి నీ సెల్ నెంబరెందుకిచ్చావ్?''

''నా ఫ్రెండ్ అనిత దగ్గర తీసుకున్నాడట'' అమాయకంగా అంది.

''సరే పద'' అని భావనని నాతో కార్లో తీసుకెళ్ళి సెల్‌ఫోన్లో సిమ్‌కార్డ్ మార్చి, కొత్త నంబరు తీసుకున్నాను.

''భావనా! ఈ నంబరు నీకూ, నాకూ, మీ అమ్మకి మాత్రమే. మరెవ్వరికీ తెలియనివ్వకు. మన ముగ్గురి మధ్యా కమ్యూనికేషన్ కోసమే'' అని అనునయంగా చెప్పాను నాన్న ఏడేళ్ళ మౌనపు శిక్ష అనుభవించిన నేను.

